సాక్షి జగిత్యాల

గురువారం : 10 : ఆగస్టు : 2023



కార్మికుల సమ్మె విరమణ

జగిత్యాలరూరల్: సర్కారు హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు పంచాయతీ కార్మికులు బుధవారం అధికారులకు లేఖ ఇచ్చారు.



భరణి నక్షత్ర పూజలు

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీయమధర్మరాజు ఆలయంలో బుధవారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళల రక్షణకు కృషి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి చేస్తుందని షీటీం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. చల్‌గల్ జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వేధింపులకు గురైనవారు షీటీం నంబరు 87126 70783కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, మంజుల పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌ను ఆశించిన తెగుళ్లు



పంటను పరిశీలిస్తున్న సురేశ్‌కుమార్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఆయిల్‌పామ్ పంటను తెగుళ్లు ఆశించాయని, వాటి నియంత్రణకు రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ సూచించారు. ఇబ్రహీంపట్నం, బర్దీపూర్ గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను బుధవారం ఆయన పరిశీలించారు. అంతర పంటలైన సోయాబీన్ ఎదుగుదల తీరుపై ఆరా తీశారు. సోయాబీన్‌కు కల్లాపు తెగులు ఆశించిందని, దీని నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈవోలు హరీశ్, నరేశ్, శ్యామ్‌కుమార్, రవళిక, రైతు తీగల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

'గద్దరన్న' సభకు తరలిరండి



మాట్లాడుతున్న మారంపెల్లి రవీందర్

కథలాపూర్(వేములవాడ): మండలకేంద్రంలో ఈనెల 12న ప్రజాగాయకుడు 'గద్దరన్న యాది'లో సంతాపసభ నిర్వహిస్తామని, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని సామాజిక తెలంగాణ ధూంధాం రాష్ట్ర అధ్యక్షుడు మారంపెల్లి రవీందర్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజల కోసమే కాకుండా దేశంలోని బలహీనవర్గాలకు తన ఆట, పాటల ద్వారా అండగా నిలిచారన్నారు. అలాంటి ప్రజా గాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం, కలిగోట రాజన్న, బత్తుల నరేశ్, మైస శ్రీధర్, జలేందర్, నర్సయ్య, దశరథం, కిరణ్, సతీశ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేసేందుకు దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలు ప్రవేశ పెట్టారని విమర్శించారు. నాయకులు బత్తిని నాగరాజు, ఇద్దం సుధీర్, రాకేశ్ నాయక్, మహిపాల్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, మున్ను, షాకీర్, నరేశ్, దిలీప్, మసూద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను తొలగించాలి

జగిత్యాలటౌన్: చేపపిల్లల పంపిణీ పథకంలో దళారీ వ్యవస్థను రద్దు చేసి, నగదు అందజేయాలని జీవన్‌రెడ్డి కోరారు. పలువురు మత్స్యకారులు ఆయనకు చేపలను బహుమతిగా అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తోపారపు రజనీకాంత్, దేశవేని రాజేశ్, రుత్త నారాయణ, తోపారపు రవీందర్, తోకల నర్సయ్య ఉన్నారు.

వైన్స్‌లకు దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ శాఖ పరిధిలో మద్యం దుకాణాలకు బుధవారం సాయంత్రం వరకు 35 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

సుపారీ కిల్లర్స్

- ముగ్గురూ ప్రొఫెషనల్సే..
- మూడు హత్య కేసుల్లో నిందితులు
- పక్కా ప్రణాళికతోనే మర్డర్లు
- లక్ష్మీరాజం హత్య ప్రతీకారమే..
- నిందితుల్లో ఒకరి ఇల్లు ధ్వంసం

జగిత్యాలక్రైం/కోరుట్ల: ఆ ముగ్గురూ సుపారీ కిల్లర్లు.. హత్యలు చేయడంలో నిష్ణాతులు.. ఇప్పటివరకు మూడు మర్డర్లలో పాలుపంచుకున్నారు. కోరుట్లలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం హత్య మాత్రం తన స్నేహితుడు ప్రవీణ్‌సింగ్ మర్డర్‌కు ప్రతీకారంగానే చేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. లక్ష్మీరాజం హత్యలో పాలుపంచుకున్న నాగరాజు, వంశీని సంఘటన అనంతరం అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అదే రోజు రాత్రి నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో త్రిమూర్తులు, పిల్లి సత్యనారాయణను పట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ నలుగురిని పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.



యువకుల దాడిలో ధ్వంసమైన నిందితుడు నాగరాజు ఇల్లు



మరో ఇంట్లో ధ్వంసమైన ఫ్రిజ్

సుపారీ ఇస్తే చాలు..

- పిల్లి సత్యనారాయణ, త్రిమూర్తులు, నాగరాజు.. ఈ ముగ్గురు కలిసి నాలుగేళ్ల క్రితం కరీంనగర్ జిల్లా ఎల్‌ఎండీ పరిధిలో నెలకొన్న ఓ భూపంచాయితీ విషయంలో సుమారు రూ.కోటికి పైగా సుపారీ తీసుకుని ఓ వ్యక్తిని హతమార్చారు. ఈ సంఘటన అనంతరం పోలీసులు వీరితోపాటు మరికొందరిని అరెస్టు చేసి జైలుకు పంపించారు.
- మూడేళ్లక్రితం సిద్దిపేట జిల్లా చినకోడూర్‌లో జరిగిన ఓ హత్య కేసులో పిల్లి సత్యనారాయణ, త్రిమూర్తులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ హత్యలో సుపారీ మాట్లాడుకున్నారా? అనే విషయం వెల్లడి కాలేదు.
- ఆర్నెల్ల క్రితం పిల్లి సత్యనారాయణ ఒక్కడే జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో ఓ వృద్ధుడిని హత్య చేసి ఆ మృతదేహాన్ని అడవిలో పారేశాడు. దృశ్యం సినిమా తరహాలో వృద్ధుడి సెల్‌ఫోన్ ఓ బస్సులో వేసి కేసును పక్కతోవ పట్టించేందుకు యత్నించాడు.
- తొమ్మిది నెలలు క్రితం కోరుట్ల మండలం పైడిమడుగులో ఓ వ్యక్తి హత్య కోసం రూ.5 లక్షల వరకు సుపారీ మాట్లాడుకున్నారు. ఆ సొమ్ము చేతికి అందకపోవడంతో ఎదుటిపక్షం వారికి సమాచారం లీక్ చేశారు. వారిని బెదిరించి డబ్బు వసూలు చేసేందుకు యత్నించారు. ఈ కేసులో నాగరాజుతో పాటు మరొకరిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.
- కోరుట్లలోనూ ఇటీవల కొందరు వ్యాపారులు, యువకులను కొట్టి, బెదిరించి డబ్బులు వసూలు చేసిన సంఘటనలపై పోలీసులు వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నారు.

లక్ష్మీరాజంది ప్రతీకార హత్యే!

నాలుగు నెలల క్రితం జరిగిన పట్టణానికి చెందిన ప్రవీణ్‌సింగ్ హత్య కేసులో నిందితులకు మద్దతుగా ఉన్నాడన్న అపోహతోనే పోగుల లక్ష్మీరాజం హత్యకు పాల్పడ్డట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారు. అయితే, సుపారీ విషయంలోనే హత్య చేశారనే అనుమానాల నివృత్తి కోసం పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. లక్ష్మీరాజం హత్యలో ఈ వీరితోపాటు ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే దిశలో పోలీసుల విచారణ సాగుతోంది.

పక్కదోవ పట్టించే యత్నం..

నాగరాజు తాను లక్ష్మీరాజం హత్యలో పాలుపంచుకోలేదని పోలీసులను నమ్మించడానికి మంగళవారం ఉదయం సీసీ కెమెరాలు ఉన్నచోట నుంచి పిల్లి సత్యనారాయణ, త్రిమూర్తులు మోటార్‌సైకిల్‌పై తిరిగేలా పథకం రచించినట్లు సమాచారం. ఆ తర్వాత నాగరాజు మరో వ్యక్తితో కలిసి సీసీ కెమెరాలు లేని ఏరియా నుంచి క్రిస్టియన్ కాంపౌండ్ వద్దకు చేరుకుని లక్ష్మీరాజంపై కత్తితో దాడికి దిగినట్లు పోలీసులు గుర్తించారు. లక్ష్మీరాజంపై దాడికి పాల్పడ్డ నాగరాజు అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోయి అల్లమయ్యగుట్ట ప్రాంతంలోని ఓ పొలం వద్దకు చేరుకుని పనిచేస్తున్నట్లుగా పోలీసులను నమ్మించేందుకు యత్నించినట్లు తెలిసింది. నాగరాజు కత్తులను ఇటీవల దుబాయ్ నుంచి తెప్పించినట్లు తెలిసింది. లక్ష్మీరాజం హత్యకు ఉపయోగించిన కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోగుల లక్ష్మీరాజం హత్య తర్వాత పిల్లి సత్యనారాయణ, త్రిమూర్తులు మంగళవారం రాత్రి ఖానాపూర్ వెళ్లి ఓ వ్యక్తి వద్ద దావత్ చేసుకోగా.. పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వరుస హత్యలతో కలకలం..

వారం క్రితం పట్టణానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ హత్యకు గురికావడం, ఇంతలోనే పోగుల లక్ష్మీరాజం మర్డర్ జరగడంతో పట్టణంలో కలకలం నెలకొంది. వారం వ్యవధిలోనే వరుస హత్యలు జరగడం చర్చనీయాంశంగా మారింది. గత ఆర్నెల్లలో కోరుట్ల సర్కిల్‌లోని కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో ఏడుచోట్ల హత్యలు జరగడం కలవరపెడుతోంది.

నాగరాజు ఇల్లు ధ్వంసం..

బుధవారం రాత్రి కొందరు యువకులు ప్రకాశం రోడ్డులో నాగరాజు అద్దెకు ఉండే ఇంటిపై పెట్రోల్ చల్లి కాల్చివేసేందుకు యత్నించారు. పోలీసులు వస్తారనే భయంతో చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసి పరారయ్యారు. నాగరాజు తన కార్యకలాపాలకు వినియోగించే రాంనగర్‌లోని మరో ఇంటిపైనా దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. నేరస్తులకు ఇల్లు ఎందుకు అద్దెకు ఇచ్చారని యజమానులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. వీరు తల్వార్లతో పట్టణంలో సంచరించడం గమనార్హం.

'మోడల్' టీచర్ల బదిలీలపై ఉత్కంఠ

- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్న యంత్రాంగం



కథలాపూర్(వేములవాడ): మోడల్ స్కూల్ టీచర్ల బదిలీల ప్రక్రియపై రోజురోజుకూ ఉత్కంఠ పెరుగుతోంది. ఆదర్శ పాఠశాలలు ఏర్పాటయ్యాక తొలిసారి ఉపాధ్యాయుల/అధ్యాపకుల బదిలీలకు ప్రభుత్వం షెడ్యూల్ జారీచేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. ఈనెల 10న వెలువడే కోర్టు తీర్పుతో బదిలీ ఉత్తర్వుల జారీ ముడిపడి ఉండటంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. మోడల్ స్కూళ్లలో పనిచేసే ప్రిన్సిపాళ్లు, పీజీటీ, టీజీటీలు అందరికీ బదిలీల ప్రక్రియలో అవకాశం కలుగనుంది. మరోవైపు బదిలీలపై బోధన సిబ్బంది దృష్టి సారించడంతో ఆశించిన స్థాయిలో విద్యాబోధన సాగడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో 13 స్కూళ్లు.. 171 మంది టీచర్లు..

- జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తుండటంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో నలుగురు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ) 123 మంది, ట్రైన్డ్ గ్యాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ) 44 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.
- మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాక వాటిలో పనిచేసే బోధన సిబ్బంది నియామకమైనా.. ఇప్పటివరకు బదిలీలు జరగలేదు.
- రాష్ట్రంలో కొత్త జిల్లాలు, జోన్‌లు ఆవిర్భావం తర్వాత బోధన సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.
- ఈ నేపథ్యంలో పాత జోన్‌ల ప్రకారమే బదిలీలకు ప్రభుత్వం ముందుకు వచ్చినా.. సీనియార్టీ, స్పౌజ్ కేటగిరీ విషయమై పలువురు టీచర్లు కోర్టును ఆశ్రయించారు.
- దీంతో టీచర్ల బదిలీలకు సంబంధించి గతనెల 5 నుంచి 27వ తేదీ వరకు చేపట్టిన ప్రక్రియకు బ్రేక్ పడినట్లయ్యింది.
- సీనియార్టీ జాబితా విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించి ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు.
- చివరగా బదిలీ ఉత్తర్వులు జారీ కావడమేనని అనుకుంటున్న తరుణంలో కోర్టు తీర్పు కోసం మొత్తం ప్రక్రియ ఆగిపోయింది.
- సుమారు నెలరోజులుగా బదిలీల గురించే బోధన సిబ్బంది చర్చించుకుంటున్నారు.
- దీంతో విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతోందని తల్లిదండ్రులు అంటున్నారు.
- ఎలాగైనా బదిలీపై వెళ్తున్నామనే భావనలో కొందరు విధులపై సరిగా దృష్టి సారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

అవకాశం ఇవ్వాలి



మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. 2013 సంవత్సరంలో మోడల్ స్కూల్ టీచర్‌గా విధుల్లో చేరిన. ఉద్యోగం వచ్చిందని దూరంగా ఉన్నప్పటికీ కథలాపూర్‌లో పోస్టింగ్ తీసుకున్న. బదిలీలు జరిగితే సొంత జిల్లాకు వెళ్లాలని ఏళ్లుగా ఎదురుచూస్తున్న. సుమారు పదేళ్ల తర్వాత బదిలీకి అవకాశం వచ్చిందని సంతోషపడిన. కోర్టు తీర్పు వాయిదా పడటంతో బదిలీ ప్రక్రియ ఆపేశారు.

– పూర్ణచందర్, మోడల్ స్కూల్ టీచర్, కథలాపూర్

కొత్త జోన్‌ల ప్రకారమే..



ప్రభుత్వం స్పందించి మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలలను 317 జీవో పరిధిలోకి తీసుకురావాలి. బదిలీలు కొత్త జోన్‌ల ప్రకారం చేపడితే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుంది. పాత జోన్‌లతో బదిలీల ప్రక్రియ చేపడితే టీచర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకుసాగాలి. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి.

– తులసి ఆగమయ్య, యూటీఎఫ్ నేత

'సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి'

సారంగాపూర్(జగిత్యాల): సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పీఆర్‌సీ వేసి, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు తపస్ పోరాటం చేస్తుందని తెలిపారు. నాయకులు గుడిసె పూర్ణచందర్, కనపర్తి సంతోష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



సభ్యత్వం ఇస్తున్న నాయకులు

సామాజిక సేవలో పాలుపంచుకోవాలి

- టీ సెర్ప్ జిల్లా ప్రాజెక్టు అదనపు డైరెక్టర్ శ్రీకర్ సుధీర్

జగిత్యాలరూరల్: జిల్లాలో మహిళా సమాఖ్యలు ఆర్థిక సేవలతోపాటు సామాజిక సేవల్లోనూ పాలుపంచుకోవాలని టీ సెర్ప్ జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీకర్ సుధీర్ సూచించారు. జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, మండల సమాఖ్యల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏటా గ్రామ సమైక్యలు మండల సమాఖ్యల మహాసభలు నిర్వహించి, ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు, కార్యక్రమ వివరాలు సభ్యులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతీ మూడు సంవత్సరాలకోసారి నూతన పాలకవర్గం సభ్యులను ఎన్నుకోవాలన్నారు. ఆ తర్వాత సంవత్సరంలో ఆసక్తిలేని పాలకవర్గ సభ్యుల స్థానంలో కొత్త వారిని ఎన్నుకోవాలని సూచించారు. గ్రామైక్య సంఘం అసిస్టెంట్లకు రెండురకాల రిజిస్టర్లను వీవోఏలు అందజేయాలని సూచించారు. అనంతరం రెండు మండలాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. జగిత్యాల రూరల్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మారు సత్తవ్వ, ఉపాధ్యాక్షురాలిగా సునీత, ప్రధాన కార్యదర్శిగా భారతి, సహాయ కార్యదర్శిగా సంధ్యారాణి, కోశాధికారిగా లతను ఎన్నుకున్నారు. జగిత్యాల అర్బన్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా గంగాభవాని, ఉపాధ్యక్షురాలిగా కళావతి, ప్రధాన కార్యదర్శిగా జమున, సహాయ కార్యదర్శిగా లత, కోశాధికారిగా సుమలతను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు వెంకటేశ్, మానికరెడ్డి, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారం, రవీందర్, రాజేందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రతినిధులు

కొత్త పీఆర్సీ ప్రకటించాలి

- గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్

జగిత్యాలటౌన్: కొత్త పీఆర్సీ వేసి ఆ వెంటనే ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో బుధవారం టీజీవోల సంఘం అత్యవసర సమావేశం గంగుల సంతోష్ అధ్యక్షతన జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇటీవల రెగ్యులరైన జూనియల్ లెక్చరర్లకు సంఘంలో సభ్యత్వం కల్పించారు. అనంతరం సంతోష్ మాట్లాడారు. డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కస్తూరి సతీశ్‌కుమార్‌ను టీజీవో కార్యవర్గ సభ్యుడిగా, జూనియర్ లెక్చరర్ అత్తినేని శ్రీనివాస్‌ను సంయుక్త కార్యదర్శిగా కార్యవర్గంలో చేర్చుకుని బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. నూతనంగా సంఘంలో చేరిన వారితోపాటు సభ్యులు అందరూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడు రవిబాబు, డాక్టర్ అశోక్, కోశాధికారి గణేశ్, సంఘం బాధ్యులు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గెజిటెడ్ అధికారులు

మెరుగైన సేవలకు జాతీయ గుర్తింపు

- ఎన్‌క్వాస్ అవార్డుకు మేడిపెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంపిక
- అవార్డు కింద ఏటా రూ.2 లక్షల చొప్పున మూడేళ్లపాటు మంజూరు

కథలాపూర్(వేములవాడ): స్వచ్ఛత, గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు జాతీయ పురస్కారాలు సొంతం చేసుకున్నాయి. ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో సమస్యలు అధిగమిస్తూ జాతీయ ప్రమాణాలు పాటించి కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) అవార్డుకు మేడిపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపికైంది.

రెండురోజుల పరిశీలన..

- కేంద్రప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అందించే అత్యుత్తమ పురస్కారానికి ఎంపిక చేసేందుకు ఎన్‌క్వాస్ బృందం అధికారులు గతనెల 19, 20 తేదీల్లో రోజుకు సుమారు 12 నుంచి 14 గంటలపాటు మేడిపెల్లి పీహెచ్‌సీని పరిశీలించారు.
- ఎంతమంది వైద్యం కోసం వస్తున్నారు, వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌ల వసతి ఉందా, పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రత, పచ్చదనం లాంటి అంశాలు ఎలా ఉన్నాయనే దానిపై కేంద్ర బృందంలోని అధికారులు ఆరా తీశారు.

వివిధ అంశాలు ప్రామాణికంగా..

జాతీయ ఆరోగ్య మిషన్ జారీచేసిన వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకొని జాతీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీకి ఎంతమంది రోగులు వస్తున్నారు, ఇన్ పేషెంట్లుగా చేరిన వారికి అందిస్తున్న సేవలు, ల్యాబ్‌లు, మందులు అందిస్తున్న తీరు, నిల్వలు, మాతాశిశు సేవలు, ప్రసవాల గది, హరితహారం, జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, మెడికల్ వ్యర్థాల నిర్వహణ పరిశీలించి మేడిపెల్లి పీహెచ్‌సీకి 90.22 మార్కులు కేటాయించారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. వీటి ఆధారంగా జాతీయ పురస్కారానికి మేడిపెల్లి పీహెచ్‌సీ ఎంపికైందని అధికారులు తెలిపారు.



మేడిపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సమష్టి కృషికి నిదర్శనం



అధికారులు, వైద్యసిబ్బంది సమష్టి కృషితో మేడిపెల్లి పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ అవార్డు దక్కింది. ఎన్‌క్వాస్ అవార్డు దక్కడంతో మాపై మరింత బాధ్యత పెరిగింది. పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారం మరవలేనిది.

– శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

ఏటా రూ.2 లక్షలు.. మూడేళ్లపాటు విడుదల..

- కేంద్రప్రభుత్వ అందించే ఎన్‌క్వాస్ అవార్డు కింద ఏటా రూ.2 లక్షలు మేడిపెల్లి పీహెచ్‌సీకి మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు.
- ఇలా మూడేళ్లపాటు నిధులు అందనున్నాయి.
- అవార్డు నిధులను పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెచ్చించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.
- పీహెచ్‌సీల అభివృద్ధికి వచ్చే సాధారణ నిధులతోపాటు అదనంగా ఎన్‌క్వాస్ నిధులు రావడంతో మరింత అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించండి

- కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన

జగిత్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంల సర్వీసును క్రమబద్ధీరించాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. 16ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా వినూత్నరీతిలో నిరసన తెలుపుతూ వస్తున్నారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాండ్ల మాధురిమ మాట్లాడారు. ఈనెల 15వ తేదీలోగా తమ సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 16వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతామని ఆమె హెచ్చరించారు. అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత, రెండో ఏఎన్‌ఎలు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న ఏఎన్‌ఎంలు

క్లుప్తంగా

గోదావరిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

ధర్మపురి: గోదావరిలో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని టీకానపల్లికి చెందిన నరేందుల రాజయ్య(58) కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతున్నాడు. కుటుంబసభ్యులు ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తుండటంతో భయపడిన ఆయన బుధవారం సాయంత్రం రాయపట్నం వద్ద గోదావరిలో దూకాడు. రాజయ్య మృతదేహాన్ని జాలర్ల సాయంతో బయటకు తీశారు. ఎస్సై దత్తాత్రి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళ మెడలోని పుస్తెల తాడు చోరీ


సీసీ ఫుటేజీలో దుండగులు

మల్యాల(చొప్పదండి): ఓ మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఆమె మెడలోని పుస్తెల తాడును దుండగులు లాక్కెళ్లిన ఘటన మల్యాల అడ్డరోడ్డులో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. లంబాడిపల్లికి చెందిన పొన్నం రాజవ్వ బుధవారం మల్యాల అడ్డరోడ్డులోని ఓ పాఠశాల సమీపంలో నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో బ్లూ కలర్ స్కూటీపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని పుస్తెల తాడును తెంపుకొని వెళ్లారు. బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించింది. వారు సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి, ఇద్దరు స్కూటీపై వెళ్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తు పట్టినవారు ఎస్సై 87126 56830, సీఐ 87126 56818 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. తగిన పారితోషికం ఇస్తామని, వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

15 కిలోల చేప


చేపతో సర్పంచు మహిపాల్‌రెడ్డి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం శివారు అరుగుండాల ప్రాజెక్టు దిగువ కాలువలకు డీఈ చక్రూనాయక్ బుధవారం మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా నీటిలో దాదాపు 15 కిలోల చేపను స్థానికులు పట్టుకున్నారు. సర్పంచు నల్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నారపాక రమ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్ తదితరులున్నారు.

పడిపోయిన పత్తి ధర

- ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.6 వేలు
- గతేడాది రూ.13 వేలు పలికిన వైనం
- జిల్లాలో లక్ష క్వింటాళ్లకు పైగా నిల్వ
- రేటు పెరగకపోవడంతో రైతుల ఆశలు ఆవిరి

గొల్లపల్లి: పత్తి ధర్పై రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పంట సీజన్‌లో ఉన్న ధర కూడా ప్రస్తుతం లేదు. మునుపెన్నడూ లేని విధంగా గతేడాది మే నెలలో క్వింటాల్‌కు రికార్డు స్థాయిలో రూ.13 వేలు పలికింది. ఈ ఏడాది కూడా అదే ధర వస్తుందని అన్నదాతలు ఆశపడ్డారు. పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకోగా ఇటీవలి వరకు క్వింటాల్‌కు రూ.7 వేలు పలికి, ఇప్పుడు రూ.6 వేలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్ ప్రారంభమై పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. దీంతో నిల్వ చేసిన పత్తిని అమ్ముకోక తప్పని పరిస్థితి నెలకొంది. నెలల తరబడి దాచినా కనీసం సీజన్‌లో పలికిన ధరైనా రావడం లేదని రైతులు దిగులు చెందుతున్నారు.

20 వేల ఎకరాలకు పైగా సాగు..

జగిత్యాల జిల్లాలో ప్రధానంగా గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూర్, ధర్మపురి, కొడిమ్యాల, మల్యాల మండలాల్లో సాగు చేసే పంటల్లో వరి తర్వాత స్థానం పత్తిదే. జిల్లా మొత్తంగా చూస్తే మూడో స్థానం. గతేడాది 20 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. అధిక వర్షాలు, తెగుళ్లు తదితర కారణాలతో దిగుబడి గణనీయంగా తగ్గింది. నీటి పారుదల ఉన్న ప్రాంతాల్లో ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు రాగా వర్షాధారంగా పండించిన ప్రాంతాల్లో 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. జిల్లాలో 30 శాతానికి పైగా పత్తి నిల్వలు ఉన్నట్లు అంచనా. అంటే ఇంకా లక్ష క్వింటాళ్లకు పైగా విక్రయించలేదు.


భీంరాజ్‌పల్లిలో ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

జనవరి నుంచి పతనం

గత డిసెంబర్ వరకు రూ.9 వేల నుంచి రూ.10 వేలు పలికిన పత్తి ధర ఈ ఏడాది జనవరి నుంచి క్రమంగా పడిపోతూ వచ్చింది. జనవరిలో రూ.8 వేలు, ఫిబ్రవరిలో రూ.7,700, మార్చిలో 7,300, ఏప్రిల్, మే నెలల్లో రూ.7 వేలు పలికి, జూన్, జూలైతోపాటు ఈ నెలలో రూ.6 వేలకు పడిపోయింది. వానాకాలం పంటల సాగుకు డబ్బులు అవసరం కావడంతో ఆశించిన ధర లేకపోయినా రైతులు పత్తిని విక్రయిస్తున్నారు.

విదేశీ ఎగుమతులు లేకనే..

విదేశాల్లో పత్తి పంట ఆశాజనకంగా ఉండటం, మన దేశం నుంచి ఎగుమతులు లేకపోవడం ధర్పై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికితోడు పత్తి బేరన్లు, బేళ్లు, బట్టలు ఇతర దేశాల నుంచి ఆశించిన మేర ఆర్డర్లు లేకపోవడం, పత్తి గింజల ధర గణనీయంగా పడిపోవడం కూడా ధర పతనానికి ప్రధాన కారణలని వ్యాపారులు అంటున్నారు. పంట సీజన్‌లో పత్తి గింజల ధర క్వింటాల్‌కు రూ.4,700 ఉండగా ప్రస్తుతం అన్ సీజన్ అయినప్పటికీ రూ.2,800 మాత్రమే పలుకుతోంది.

రూ.10 వేలకు అడిగితే అమ్మలే



గతేడాది రెండెకరాల్లో పత్తి సాగు చేసిన. ఎకరాకు 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 7 క్వింటాళ్ల పత్తిని రూ.8 వేల చొప్పున అమ్మి, మిగతాది నిల్వ పెట్టిన. డిసెంబర్‌లో వ్యాపారులు రూ.10 వేల చొప్పున అడిగితే ధర పెరుగుతదని అమ్మలే. ఇప్పుడు దళారులు వచ్చి, రూ.6 వేలకే అడుగుతున్నరు.

– రేవెల్లి గంగన్న, రైతు, భీంరాజ్‌పల్లి

నిల్వ చేసి, నష్టపోయినం



నేను రెండెకరాల్లో పత్తి పంట సాగు చేసిన. నీటి వనరులు ఉండటంతో 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీజన్‌లో ధర ఉన్నప్పటికీ ఇంకా పెరుగుతుందన్న ఆశతో అమ్మలేదు. ఇప్పుడు వానాకాలం పంటలకు పెట్టుబడి కోసం అమ్మక తప్పడం లేదు. పత్తి నిల్వ చేసి, చాలా నష్టపోయినం.

– తక్కల గంగారాం, రైతు, భీంరాజ్‌పల్లి

ఊహించలేదు



మునుపెన్నడూ లేని విధంగా పత్తి ధర తిరోగమనంలో పయనించింది. దీనికి ప్రధాన కారణం విదేశీ ఎగుమతులు లేకపోవడమే. అన్ సీజన్‌లో ధర పతనాన్ని ఊహించలేదు. రైతులతోపాటు వ్యాపారులు పత్తి నిల్వ చేసి, నష్టపోయారు. అమ్మకానికి సరుకు ఉన్నా దేశీయంగా, విదేశాల నుంచి ఆర్డర్లు లేవు.

– ఏవో కరుణ, గొల్లపల్లి

14 ఆలయాల్లో చోరీ.. దొంగల అరెస్టు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వరుస చోరీలకు పాల్పడుతున్న మెట్‌పల్లి పట్టణంలోని డీడీనగర్‌కు చెందిన మాగినేని దేవనర్సయ్యతోపాటు ఓ బాలుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. వారు జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని 14 ఆలయాల్లో దొంగతనం చేశారన్నారు. ఈ నెల 2న రాత్రి వర్షకొండ హనుమాన్, ఇబ్రహీంపట్నం పంచముఖి హనుమాన్ ఆలయాల్లో హుండీలు పగులగొట్టి, నగదు దోచుకెళ్లారని అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆసీస్ మొబైల్‌షాపులో చొరబడి, నగదుతోపాటు విలువైన మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఇబ్రహీంపట్నంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద పోలీసులు బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై దేవనర్సయ్య, బాలుడు అనుమానాస్పదంగా కనిపించారని చెప్పారు. పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి, పట్టుకున్నట్లు తెలిపారు. విచారణలో జల్సాలకు అలవాటు పడి, సీసీ కెమెరాలు లేని దుకాణాలు, ఆలయాలను లక్ష్యంగా చేసుకొని, చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనంతోపాటు రూ.500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేవనర్సయ్యను రిమాండ్‌కు, బాలుడిని జువెనైల్ కరెక్షన్ సెంటర్‌కు పంపించామన్నారు. దొంగలను పట్టుకున్న మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఉమాసాగర్, కానిస్టేబుళ్లు కిరణ్, సంతోష్‌లను ఎస్పీ భాస్కర్ అభినందించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

12 మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

రాయికల్: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ద్విచక్రవాహనాలను అతివేగంగా నడిపిన 12 మంది యువకులపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇక నుంచి నిరంతరం తనిఖీలు చేపడుతామని పేర్కొన్నారు.

అభివృద్ధిలో అగ్రస్థానం

- మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందు వరుసలో ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పల్లెప్రగతి ద్వారా గతంలో ఎన్నడూ లేనివిధంగా జరిగిన అభివృద్ధిని మిగతా రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. నందగిరి గ్రామంలో హరితహారంలో భాగంగా ఈతమొక్కలు నాటిన తర్వాత నామాపూర్‌లో ఎస్సారెస్పీ కల్వర్టు, మ్యాకవెంకయ్యపల్లి, రాజరాంపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి బుధవారం ప్రారంభించారు. అనంతరం కీచులాటపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మ్యాకవెంకయ్యపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమైక్యాంధ్ర పాలనలో గ్రామాలు అభివృద్ధిలో కుంటుపడ్డాయన్నారు. ఏళ్లక్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలకు మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరాయని తెలిపారు. వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. పెగడపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా 12కు పైగా కొత్త భవనాలు నిర్మించామని ఆయన చెప్పారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పల్లెప్రగతి కార్యక్రమం అమలు చేశారన్నారు. రెండోవిడ దళితబంధు కోసం కసరత్తు చేస్తున్నామని మంత్రి చెప్పారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు అండగా నిలిస్తే మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్‌పర్సన్ నిర్మల, సర్పంచులు ఇనుకొండ లక్ష్మి, ఇనుగండ్ల కరుణాకర్‌రెడ్డి, సాయిని సత్తమ్మ, గాజుల రాకేశ్, రాచకొండ స్వప్న, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీలు రవి, రజిత, సింగిల్‌విండో చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, తహసీల్దార్ ఎంఏ ఫరూక్, ఎంపీడీవో పులయ్య, ఎంపీవో మహేందర్, ఆర్బీఎస్ కన్వీనర్ నరేందర్‌రెడ్డి. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


జీపీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

నాణ్యత లోపిస్తే సిబ్బందిదే బాధ్యత

- అడిషనల్ డీఆర్డీవో శివాజీ
- మేడిపెల్లిలో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

కథలాపూర్(వేములవాడ): ఉపాధిహామీ పనుల్లో నాణ్యత లోపిస్తే సిబ్బందిదే బాధ్యత అని అడిషనల్ డీఆర్డీవో బాలె శివాజీ అన్నారు. బుధవారం మేడిపెల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డిసెంబర్ 2020 నుంచి ఈ ఏడాది మార్చి వరకు మేడిపల్లి మండలంలో రూ.18.50 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల వారీగా తనిఖీ చేసిన అంశాలను రిసోర్స్‌పర్సన్లు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల వారీగా పనుల రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. జాబ్ కార్డులను అప్‌డేట్ చేయాలని, పనులకు హాజరైన కూలీలకు పే స్లిప్పులు సకాలంలో ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలుంటాయని హెచ్చరించారు. తనిఖీలో తేలిన అక్రమాలపై ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.11 వేలు, పంచాయతీ కార్యదర్శులకు రూ.70 వేలు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.77,559, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.19 వేలు, ఏపీవోకు రూ.29 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజిలెన్స్ అధికారి చిన్నయ్య, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, ఏపీవో నవీన్‌కుమార్, ఎస్‌ఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి

రాయికల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాయికల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అల్లీపూర్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లించాలని, కేజీబీవీల టీచర్లకు టైం స్కేల్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, మండల అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, కార్యదర్శి తాటిపాముల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.


సభ్యత్వం ఇస్తున్న అమర్నాథ్‌రెడ్డి, నాయకులు

లారీని ఢీకొన్న మరో లారీ

ధర్మపురి: రాయపట్నం వైపు నుంచి ధర్మపురి వైపు బుధవారం రాత్రి రెండు లారీలు వెళ్తున్నాయి. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ వద్ద ముందు వెళ్తున్న లారీని వెనక వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదు. వెనక వాహనం ముందుభాగం దెబ్బతినగా అందులో ఉన్న ఓ వక్తికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కంప్యూటర్స్ చదివి.. సైబర్ నేరాలు

- రాజస్తాన్‌కు చెందిన యువకుడు, బాలుడిని పట్టుకున్న పోలీసులు

వేములవాడ: తమకున్న కంప్యూటర్ పరిజ్ఞానంతో అమాయకులను బురిడీ కొట్టిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు రాజస్తాన్ వాసులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడలోని తన కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. రాజస్తాన్‌లోని రామిడి పట్టణం సావాయి జిల్లాకు చెందిన రాంరేశ్ కుమార్, ఓ బాలుడు విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డారు. రాంరేశ్‌కుమార్ బీఏ కంప్యూటర్స్ వరకు చదువుకున్నాడు. తనకున్న పరిజ్ఞానంతో అమాయక ప్రజలను మోసం చేసి, డబ్బులు సంపాదించడం నేర్చుకున్నాడు. దీన్ని పలువురికి నేర్పించి, వారు అక్రమంగా సంపాదించిన డబ్బుల్లో వాటా తీసుకునేవాడు. మరోవైపు బాలుడు కూడా మన రాష్ట్రంలో ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ ద్వారా బిట్ కాయిన్‌లో డబ్బులు పెడితే అవి రెట్టింపు అవుతాయని చాలా మందికి మెస్సేజ్‌లు, కాల్స్ చేశాడు. ఈ క్రమంలో వేములవాడ పట్టణంలోని బాలానగర్‌కు చెందిన మిశ్రా సచిన్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇలాంటి మెస్సేజ్, ఫోన్ కాల్ వచ్చాయి. నమ్మిన మిశ్రా రూ.లక్ష భారత్ పే ద్వారా పంపించాడు. డబ్బులు రెట్టింపు కాదు కదా అసలు కూడా రాకపోయేసరికి వేములవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా సైబర్ టీం ఆర్‌ఎస్సై జునైద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, రాజస్తాన్‌కు చెందిన ఇద్దరిని గుర్తించింది. రాంరేశ్ కుమార్‌ను అరెస్టు చేయగా, మరో వ్యక్తి మైనర్ కావడంతో రాజస్తాన్ కోర్టులోనే హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి 7 సెల్‌ఫోన్లు, 2 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ టీం ఆర్‌ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై రమేశ్, కానిస్టేబుల్ గోపాల్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 5 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర, ఎం యాక్ట్ 2019, విద్యుత్ బిల్లు 2022తో పాటు మరో 11 అంశాలను పరిష్కరించాలని కోరారు. నాయకులు హన్మంతు తదితరులున్నారు.

బాధితులకు 'గృహలక్ష్మి' దక్కేనా?

- వరదల్లో సర్వం కోల్పోయిన అభాగ్యులు
- అగ్నిప్రమాదాలకు నిరాశ్రయులైన పేదలు
- గృహలక్ష్మి పథకంలో ప్రాధాన్యం కోసం విన్నపం


పెగ్గెర్లలో కూలిన ఇంటివద్ద బాధితుడు లక్ష్మణ్


గతేడాది భూషణరావుపేటలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు రాజుబాయి

కథలాపూర్(వేములవాడ):సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. అయితే, నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేస్తామని ప్రకటించడంతో తమను వరిస్తుందో లేదోనని పేదలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా భారీవర్షాలు, అగ్నిప్రమాదాల్లో ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డ నిరాశ్రయులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాల్లోని బాధితులు కోరుతున్నారు.

గతేడాది 142 ఇళ్లకు నష్టం..

- జిల్లాలోని కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాల్లో గతేడాది ఏకధాటిగా కురిసిన భారీవర్షాలతో భారీ సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి. – ప్రధానంగా మేడిపెల్లి మండలంలో 93 ఇళ్లు, కథలాపూర్ మండలంలో 52 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు రికార్డుల్లో నమోదైంది.
- అప్పట్లో ఒక్కో బాధితుడికి రూ.3,200 చొప్పున పరిహారం అందించారు.
- బాధితులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని పాలకులు, అధికారులు హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.
- ఈఏడాది గతనెలలో కురిసిన వర్షాలకు మూడు మండలాల్లో కలిసి 42 ఇళ్లకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.
- వీరికి ఇంకా పరిహారం చెల్లించలేదు.
- మరోవైపు.. మొన్నటి వేసవిలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులు ఒకరు ఉన్నట్లు తెలిసింది.
- ఇదిలా ఉంటే.. ఇళ్లులేని పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి దరఖాస్తులు స్వీకరిస్తోంది.
- మంగళవారం వరకు మూడు మండలాల్లో 880 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.
- గృహలక్ష్మి పథకంలో వర్షాలతోపాటు అగ్నిప్రమాదాతో ఇళ్లు కోల్పోయిన తమకు ప్రాధాన్యం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

ఇల్లు కాలిపోయింది



మొన్నటి ఎండకాలంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలు లేచి అంటుకుని ఇల్లు మొత్తం కాలిపోయింది. వస్తుసామగ్రి కాలిబూడిదయ్యాయి. అధికారులు వచ్చి పరిశీలించారు. నాయకులు వచ్చి పరామర్శించారు. డబుల్‌బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేయలేదు. గృహలక్ష్మి పథకంలో మాకు ప్రాధాన్యం ఇవ్వండి.

– శ్రీగద్దె ప్రభాకర్, అగ్నిప్రమాద బాధితుడు, ఊటొపెల్లి

వర్షానికి కూలింది



నాకు అమ్మానాన్న లేరు. ఒంటరి వాడిని. రెండేళ్ల కింద వర్షం పడి ఇల్లు కూలింది. వస్తువు, సామగ్రి వర్షపునీటిలో తడిసి పనికిరాకుండాపోయాయి. అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెల్ల దీస్తున్నా. డబుల్‌బెడ్రూమ్ ఇల్లు మంజూరవుతుందని ఏళ్లుగా ఎదురుచూస్తున్నా. గృహలక్ష్మి కిందనైనా ఆర్థిక సాయం చేయండి

– అల్లె గంగారాం, భూషణరావుపేట

ఏ పనీ చేయలేకపోతున్న.. ఆదుకోండి

- ఇన్ఫెక్షన్‌తో చేతివేళ్లు చెడిపోయాయి..
- కుటుంబ పోషణ భారమవుతోంది..
- కలెక్టర్‌కు గల్ఫ్ బాధితుడి వేడుకోలు

మల్లాపూర్: అప్పుల బాధతో దుబాయి వెళ్లిన తాను అక్కడ అనారోగ్యానికి గురై, రెండు నెలలకే ఇంటికి వచ్చానని మల్లాపూర్ మండలంలోని వేంపల్లికి చెందిన చందనగిరి శ్రీనివాస్ తెలిపాడు. దుబాయిలో ఐసీయూలో ఉన్నప్పుడు ఇన్ఫెక్షన్‌తో చేతివేళ్లు చెడిపోయి, ఏ పనీ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవి బుధవారం అతన్ని జగిత్యాల కలెక్టరేట్‌కు తీసుకెళ్లగా కుటుంబపోషణ భారమై, తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని కలెక్టర్ యాస్మిన్‌బాషా ఎదుట వాపోయాడు. తనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించాడు.


కలెక్టరేట్ ఎదుట రవితో శ్రీనివాస్

అంజన్న ఆదాయం రూ.1.15 కోట్లు

కొండగట్టు(చొప్పదండి):జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీలను బుధవారం కరీంనగర్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించారు. మొత్తం 75 రోజులకు రూ.1,15,53,532 ఆదాయం సమకూరింది. 27గ్రాముల మిశ్రమ బంగారం, 4.800 కేజీల వెండి, 70 విదేశీ కరెన్సీ నట్లు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశ్, అధికారులు జమున, శ్రీనివాస్, సునీల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


నగదు లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 7013501541 [H-788615]

BUSINESS OFFER

■ ద్వారా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్: 9310515624, 8800496710 [DA-38443]

WANTED

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221507]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం 20000/- 7993700904, 9014504770, 8977743043. [W-1002992]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-11729]

■ MNC Recruitment Drive @ Karimnagar on 15th August Age 25+. Any Qualification Working Retired Jobless or Housewives Send your Resume & Aadhar Card to Register your name & details: Ph: 7901020195. [HA-94514]

■ ఆంధ్రప్రదేశ్‌లో న్యూ బ్రాంచ్ ఆఫీసులో వర్క్ చేయుటకు టీమ్‌లీడర్స్, రిటైర్డ్ గృహిణులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు అర్జెంటు జాయిన్. P/T 18,500/-, F/T 23,500. Cont: 9844583004 [G-786540]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824